# అష్టాదశ శక్తి పీఠములు

డాక్టర్ (శ్రీమతి) ధారా విజయలక్ష్మి

హిందువులు పార్వతీదేవిని ఆరాధించే దేవాలయాలలో, పురాణ గాథల ఆధారంగా, ఆచారాల పరంగా ప్రాధాన్యత పొందిన కొన్ని స్థలాలను శక్తిపీఠాలు అంటారు. ఈ శక్తిపీఠాలు ఎన్ని అనే అంశంలో విబేధాలు ఉన్నాయి. ఇవి 18 అని, 51 అని, 52 అని, 108 అని వేర్వేరు లెక్కలున్నాయి. అయితే 18 ప్రధాన శక్తిపీఠాలను అష్టాదశ శక్తిపీఠాలని అంటారు. ఆదిశంకరాచార్యులు 18 పీఠాలపై స్తోత్రమును వ్రాసి, ఆ పీఠాల పేర్లను పేర్కొన్నారు.

ఈ శక్తిపీఠాలు ఏర్పడడానికి కారణం తెలిపే ఒక పురాణగాథ ప్రాచుర్యంలో ఉంది. ఒకప్పుడు దక్షుడు 'బృహస్పతి యాగం' చేసినపుడు అందరినీ ఆహ్వానించి, శివుడిని, సతీదేవిని (కూతురుని అల్లుడిని) పిలవలేదు. దీనికి కారణం, ఒకసారి బ్రహ్మ నిర్వహించిన యజ్ఞములో దక్షప్రజాపతి వచ్చినప్పుడు శివుడు లేచి నిలబడలేదని, అది అతను అవమానముగా భావించి ప్రతీకారం తీర్చుకుంటానని దక్షుడు ప్రతిజ్ఞ చేస్తాడు. శివుడిని అవమానించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో, దక్షుడు, వారిరువురిని యజ్ఞమునకు ఆహ్వానము పంపలేదు. పుట్టింటి వారు ప్రత్యేకంగా పిలవాలేమిటి అని సతీదేవి శివుని మాట వినకుండా ప్రమథ గణాలను వెంట బెట్టుకొని యాగానికి వెళ్ళింది. అక్కడ అవమానానికి గురియై, శివనిందను భరించలేక, ఆమె యాగాగ్నిలో తనువు చాలించింది. ఆగ్రహించిన శివుడు, తన గణాలతో యాగశాలను ధ్వంసం చేశాడు.

సతి వియోగాన్ని భరించలేని శివుడు, ఆమె మృత శరీరాన్ని అంటిపెట్టుకుని, తన జగద్రక్షణా కార్యాన్ని మరచాడు. దేవతల ప్రార్థనను మన్నించి విష్ణువు సుదర్శన చక్రంతో సతిదేహాన్ని ఖండించి, శివుని కర్తవ్యోన్ముఖుడిని చేశాడు. సతిశరీర భాగాలు పడిన చోటుని శక్తిపీఠాలుగా భావిస్తారు. ముఖ్యంగా తంత్ర సాధనకు ఆరాధనా స్థలాలు.

తాంత్రిక సాధనలు చేసే శక్తి పీఠాలను, సాత్విక పూజామందిరాలుగా నెలకొల్ప నిశ్చయించిన ఆదిశంకరాచార్యులు, శక్తి పీఠాలలో శ్రీ చక్రాలను స్థాపించారు. ఉత్తర హిందూస్థానము, వంగదేశము, మహారాష్ట్రలోను శ్రీచక్రము నెలకొల్పబడినా కొన్నిచోట్ల తాంత్రిక పూజలు నిర్వహింపబడుతున్నాయి. దక్షిణాదిన శ్రీచక్ర స్థాపన జరిగిన క్షేత్రాలలో పూజలు నిర్వహింపబడుతున్నాయి. కంచిలో అమ్మవారు శ్రీ చక్రముపై కూర్చొనకుండా యోగ ముద్రలు పద్మాసనములో కనబడతారు. ద్రాక్షారామములో మాణిక్యాంబ అమ్మవారు శ్రీ చక్రముపై కొలువై యుంటారు.

శక్తి పీఠాలలో నెలకొన్న పార్వతీ దేవిపై అష్టాదశ కీర్తనలు రచించి, గానము చేయాలనుకున్న సంకల్పంతో ఈ రచనలు చేశాను. అమ్మవారి కృపాకటాక్షములను కురిపించమని వేడుకుంటున్నాను.

## శ్రీ శంకరాచార్య విరచిత అష్టాదశ శక్తిపీఠ స్తోత్రము

లఙ్కాయాం శాఙ్కరీదేవీ కామాక్షీ కాఞ్చికాపురే ।
ప్రద్యుమ్నే శృఙ్ఖలాదేవీ చాముణ్డీ క్రౌఞ్చపట్టణే ॥

అలమ్పురే జోగులామ్బా శ్రీశైలే భ్రమరామ్బికా ।
కోల్హాపురే మహాలక్ష్మీ ముహుర్యే ఏకవీరికా ॥

ఉజ్జయిన్యాం మహాకాలీ పీఠిక్యాం పురుహూతికా ।
ఓఢ్యాయాం గిరిజాదేవీ మాణిక్యా దక్షవాటకే ॥

హరిక్షేత్రే కామరూపా ప్రయాగే మాధవేశ్వరీ ।
జ్వాలాయాం వైష్ణవీదేవీ గయా మాఙ్గల్యగౌరికా ॥

వారాణస్యాం విశాలాక్షీ కాశ్మీరేషు సరస్వతీ ।
అష్టాదశ సుపీఠాని యోగినామపి దుర్లభమ్ ॥

సాయఙ్కాలే పఠేన్నిత్యం సర్వశత్రువినాశనమ్ ।
సర్వరోగహరం దివ్యం సర్వసమ్పత్కరం శుభమ్ ॥
ఇతి అష్టాదశ శక్తి పీఠ స్తోత్రం సంపూర్ణమ్ ॥

### 1. శాంకరీదేవి

శ్రీలంకా ద్వీపవాసిని, శ్రీసతి శాంకరీ దేవి సన్నుతింతు నమ్మా, సరగున పాలించవమ్మా ॥

1. సతి ఊరువు పడిన చోట, స్థితమాయెను శ్రీచక్రము అష్టాదశ పీఠములలో, అదె, ఆది పాదమమ్మా ॥
2. త్రింకోమలిలో వెలసిన, త్రికోణేశ హవరు రాణి చరణములు పట్టినాను, చరాచర జగన్మాత ॥

### 2. కంచి కామాక్షి

కంచిలో వెలసిన కామాక్షి అంబ కామితార్థ ప్రదాయిని మమ్ముకావవే ॥

1. సతినాభి జారిపడగ, మొలవడ్డాణముతో శంకరులు ద్వితీయ శక్తిపీఠ మమర్చి రచట ॥
2. భండాసుర సంహారిణి, యోగ ముద్రలో నుంటివి పాశాంకుశముల బట్టి, పద్మాసన స్థితవైతివి ॥
3. శంకరులీ ధామమున 'సౌందర్యలహరి' గూర్చ ॥
4. శ్యామాశాస్త్రి నీ దివ్య కీర్తనలు రచించె ॥

### 3. శృంఖలాదేవి

ఓ జనని శృంఖలాదేవి కరుణామయి నీ బిడ్డలమే తల్లి! కాపాడుమమ్మా!

1. అవతరించినావట శృంఖలాదేవిగా అమరెను పాండువలో తృతయ శక్తి పీఠము నవజాత శిశువును లాలించు బాలింతవలె దేవి భక్తుల కెల్ల ప్రేమను పంచుదువె ॥
2. సతి ఉదర భాగము పతనమైన చోట మాత మాంగల్యదా స్థిరముగ నుంటివె ఋష్యశృంగుడు నీకు అర్చనలు సలుప ఆది శంకరులు శ్రీ చక్రమే నెలకొల్ప ॥
3. భక్తుల పాప శృంఖలములు తొలగించి ముక్తినొసగే తల్లి మాత కృపాకరీ శృంగేరి, ఛోటిల్లా, గంగాసాగర్‌లలో శృంఖలా తలతురే, తృతీయపీఠ మున్నదని ॥

### 4. చాముండి

చాముండేశ్వరి కొలువు తీరిన క్రౌంచ పట్టణము చూడుడదె చండ ముండాసురుల వధించిన చాముండికి ప్రణతులివె ॥

1. నాల్గవ శక్తి పీఠమదె నాడదేవి నివాసమదె పతనమాయె సతికురులచట అతి ప్రసిద్ధ క్షేత్రమదె ॥
2. దశరా నవరాత్రులు ఘనముగ దేవిని కొలుచు వేళయదె ఆషాడ భృగు వారములు ఆర్తితో అర్చనలు చేతురె ॥

## 5. జోగులాంబ

అలంపురములో ఆదిశక్తిరో యోగులమ్మరో జోగులాంబరో

1. తేలు, కప్ప, బల్లి తల్లి శిగన చూడరో శవమే గద్దెగా కూర్చున్న తల్లిరో ॥
2. ఐదవ శక్తి పీఠమదె చూడరో శంకరులమర్చిన శ్రీ చక్రమదె గాంచరో ॥
3. సతి దంతములే పడిన నేలకు మ్రొక్కరో నవ బ్రహ్మములు గల సంగమమదె గనరో ॥
4. తాంత్రిక విద్యలు, సఫలమగు చోటురో అరి భయంకరిని, జోగులమ్మను తలవరో ॥

## 6. భ్రమరాంబ

శ్రీ గిరి భ్రమరాంబ, శ్రీ గిరి నివాసిని శ్రీ చక్రమున కొలువై, సిరుల వరము లిత్తువా?

1. అరుణాసుర సంహారము, అలవోకగ గావించి పరమేశ్వర ధామములో, భ్రమరాంబగ వెలసితివా?
2. సతి మేని కంఠమచట, పతనమయినదని అరసి ఆదిశంకరులానగమును, ఆరవ శక్తిపీఠము గానెంచె ॥
3. శ్రీ శిఖరమున స్థిరముగ, శివుని పట్టపు రాణివై పాతకముల పారద్రోలి, పాలింతువా సకలజనుల ॥

## 7. మహాలక్ష్మి

శ్రీ మహాలక్ష్మి పాలయమాం, శ్రితజన పాలిని పాలయమాం ॥

1. కొల్హాపురి నగరవాసిని, కొల్హాసుర మర్దని పాలయమాం

   పశ్చిమదిశ రవికిరణస్పర్శ, పాదయుగళే పాలయమాం ॥
2. పంచగంగా తటినిలయే, పాశాంకుశ కరకమలే పాలయమాం

   ఆదిశంకరాచార్యాసేవిత, సప్తమ పీఠనిలయే పాలయమాం ॥
3. సతి నేత్ర పతన స్థలవాసీ, మణిశిల నిర్మిత మహాలక్ష్మి పాలయమాం

   ఆదిశేష ఫణి ఛత్రశోభిత, అంబా బాయి, శివశక్త్యైక రూపిణి పాలయమాం ॥

## 8. ఏకవీర

మాహుర్ గ్రామమున, మహారాష్ట్రదేశమున మాత ఏకవీర మహిమలు చూపె ॥

1. కొలువాయెమాత, పంచగంగ తటిని కనగలము రేణుక వదనార విందమే ॥

2. ఎనిమిదవ శక్తి పీఠము వెలసె సతికుడి భుజము పతనము కాగా ॥
3. నాగవల్లి దళముల, పోకలతోదంచి నాణ్యమైన మిశ్రమము, ప్రసాదముగ నిత్తురు ॥
4. తాంత్రికులు మంత్ర, తంత్రములు నేర్వ అతి భక్తి శ్రద్ధలతో సేవింతురు తల్లిని ॥

## 9. మహాకాళి

అవంతిక నగరమున హరసిద్ధి మాతగ సప్త మోక్ష క్షేత్రమున, పూజలందు మహాకాళి ॥

1. రక్త బీజ నిషూదిని, జగదోద్ధారిణి రమావాణీల నడుమ నెలకొన్న రౌద్రాణి ॥
2. సతి పై పెదవి ఉజ్జయినిలో జార అతులిత నవమ శక్తి పీఠమై ఒప్పారె ॥
3. కాళిదాసు భక్తితో సేవించిన కాళికాంబ విక్రముని ఆరాధ్య దైవమా జగదాంబ ॥
4. అంధకాసుర మర్దని, అఘోరాల వేల్పు కొలువైనది మాత క్షిప్రానది తీరాన ॥

## 10. పురుహూతికా

నీ సాటి దైవము లేదని తలచితినే అమ్మమాయమ్మ పీఠాపురమున కొలువై నావమ్మా మాయమ్మ ॥

1. పురుహూతికా పేర పీఠమెక్కినావమ్మా, మాయమ్మ కుక్కుటేశ్వరుని రాణిని నీవమ్మా మాయమ్మా ॥
2. దశమ శక్తి పీఠమున నుంటివే మాయమ్మ దయగల తల్లివి నీవే నంటినే మాయమ్మ ॥
3. సతిమేని పీఠమిచట జారెనే మాయమ్మా శ్రీ చక్రమున స్థిరముగ నుంటివే మాయమ్మ ॥
4. వేలుపునీవని నమ్మితినే మాయమ్మ అలుపులేక మమ్ముబ్రోవవే మాయమ్మ!

## 11. గిరిజాదేవి

వైతరణి తీరమున, జాజాపూర్ నుందు శాంత రూపమున నున్న గిరిజమ్మ వెతలు తొలగించి కాపాడవమ్మా! ॥

1. సతినాభి పడిన చోట శ్రీ చక్రమునందు వెలసిన గిరిజమ్మ, వెతలు తీర్చవమ్మా ॥
2. ఎంతో పవిత్రమా ఏకాదశ పీఠము తాంత్రిక శాస్త్రముల నభ్యసించు స్థలము ॥

వైతరణిలో ఆబ్దికము చేయువారి వెతలు తొలగించి కాపాడవమ్మా!

## 12. మాణిక్యాంబ

ద్వాదశ శక్తి పీఠమదె, ద్రాక్షారామ మదె దాక్షాయని కపోల మచట, పతనమాయెనని ప్రతీతి ॥

1. శ్రీ చక్రము ఆసనముగ, శోభిల్లిన మాణిక్యాంబ భీమేశ్వరుని చెంత, కొలువుతీరిన తల్లి ॥
2. శ్రీ నాధుని రచనలలో, దక్షిణ కాశీ క్షేత్రము, పంచారామము గాను, వాసికెక్కిన క్షేత్రము ॥

## 13. కామరూపి

నీలాచలము మెరసె, కామరూపి కొలువుతీర హరిక్షేత్రము జగతిలో, ప్రఖ్యాతి నొందెపలు విధముల ॥

1. త్రయోదశ పీఠమందు, కామాఖ్యా స్థితమామె యోని ముద్రలో చూపెను, నెలవారి నిదర్శనము ॥

2. అంబు బచి అమ్మవారు, అతివ వలె శోభ లీన అరుణ అంగవస్త్రముతో, అంగనలు పూజింప ॥

3. మంత్ర, తంత్ర విద్యలకు, కేంద్రబిందు వాక్షేత్రము శివశక్తుల దీవెనలతో, జీవకోటి తరించగ ॥

## 14. మాధవేశ్వరి

శ్రీ మాత అలోపి దేవి, మాధవేశ్వరి ప్రయాగ తీర్థవాసి, సర్వమంగళా ॥

1. జగమున శిలరూపముగ వెలసినావు తల్లి జయ జయ నాదముతో నీ ఊయలనే కొలిచేము ॥

2. సతి వేలు జారెనిచట పూజలు చేసేము చతుర్దశ పీఠమిదె చక్కగ మ్రొక్కేము ॥

త్రివేణి సంగమమిదె మంగళ హారతులిచ్చేము మాధవేశ్వరి, లలితా, మాకభయము లిమ్మా ॥

## 15. వైష్ణవీ దేవి

త్రికూట పర్వత వాసిని దేవి త్రిభువన పాలిని పాలయమాం ॥

1. సతిముఖమచట పతనము కాగా జ్వాలా ముఖిగా, వెలుగు చూపిన ఆది కుమారి, కట్రావాసిని సకల శుభంకరి, పాలయమాం ॥

2. నిరతము జ్వాలగ వెలుగు లీనుట నరులెరుగని పరమ రహస్యం కోరువరములు ఈడేరునని పరి పరి విధముల ప్రార్థించేరు ॥

3. పంచదశ పీఠరూపిణి పాప విమోచని పాలయమాం ఆదిశక్తి పరి పాలయమాం, వైష్ణవీ దేవి పాలయమాం ॥

## 16. మాంగళ్య గౌరి

మాంగళ్య గౌరి మహిమలు చాటె మానవుల పోషించు స్తనరూపమున వెలసి ॥

1. షోడస శక్తి పీఠములో షోడస పూజలు చేసేరు జనులు

2. ఆశ్వీయుజ అష్టమిన అర్చింతురు అంబను

3. ఆచరించు క్రతువులు అచ్చెరవు కల్గించు అమ్మసన్నిధిలో గయలోన వీక్షించ ॥

4. ఫల్గుణీ నది తటిని ప్రజలాసక్తితో పలుతంత్ర విద్యలను అభ్యసించేరు ॥

5. బ్రతికుండగానే తమ పిండ ప్రధానము చేతురు ప్రజలు గయలోన కనగ ॥

## 17. విశాలాక్షి

వారణాశి యందు, కనుల కాంతులతో విశాలాక్షిగౌరి, కామితము లీడేర్చ ॥

1. సప్తదశ పీఠమై, కాశికాపురము వాసికెక్కె విశాలాక్షి కటాక్ష మున ॥

2. నాడు సతి మని మణికర్ణిక జార పుడమిలో విశాలాక్షిగా నిలచి శంకరార్చిత శ్రీ చక్రమున కొలువై కామితము లొసగు కల్పవృక్షమై ॥

3. భాద్రపద శుక్ల తదియ నాడార్తితో బహురీతుల, అర్చించు జనుల విన్నపముల జాగు చేయక మన్నించి విశాలాక్షి గౌరి, విజయములొసగు ॥

## 18. సరస్వతి

శ్రీ సరస్వతి నమోస్తుతే అష్టాదశ పీఠశక్తి అమలే, విమలే ॥

1. వాహిని మధుమతి తటనిలయే వాగ్దేవి హర్‌మఖ్ చలవాసే విధిపత్ని, పుస్తకపాణి, వీణా గానామృత లోలే ॥
2. కాశ్మీరపుర నివాసిని, కల్హాన కవితా వాహిని, బిల్హార కావ్య కన్యకే, సకల మంత్రాక్షరే ॥
3. సతి కర కమల పతన స్థల స్థితే శంకర విజయ కావ్యాలంకృత సర్వజ్ఞపీఠే ॥

### గ్రంథ వివరణ సూచిక / ప్రవచనములు


1. శ్రీ ఆదిశంకరాచార్య విరచిత 'అష్టాదశ శక్తి పీఠ స్తోత్రము'.
2. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రచనము - 'అష్టాదశ శక్తిపీఠ రహస్యాలు'.




డాక్టర్ (శ్రీమతి) ధారా విజయలక్ష్మి, యం.యస్.సి., యమ్.ఫిల్., పి.హెచ్.డి. – వీరు పి.హెచ్.డి పట్టము భౌతికశాస్త్ర విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి పొందియున్నారు. ఆమె తన పరిశోధనకు 'ఉత్తమ పరిశోధనా థీసిస్' అవార్డును అందుకున్నారు. వీరు సంగీత గాత్రవిభాగంలో డిప్లొమా పొందియున్నారు. డాక్టర్ విజయలక్ష్మి ఉపాధ్యాయునిగా భౌతిక ఎలక్ట్రానిక్స్ విభాగం, యస్.కె.ఆర్. కళాశాల, రాజమహేంద్రవరంలో పనిచేసి, ప్రస్తుతం పదవీ విరమణ చేసినారు. వీరు అనేక పరిశోధనా వ్యాస రచనలు చేసి, అనేక పుస్తకములు రచించి ప్రచురణ చేసినారు. వీరు 'పోతన భాగవతంలో భౌతిక శాస్త్ర అంశాలు' అనే పరిశోధన వ్యాసానికి ఉత్తమ వ్యాసంగా బహుమతి పొందియున్నారు. శ్రీమతి విజయలక్ష్మి 'శ్రీవిష్ణునామ సంకీర్తనలు' తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆమోదంతో మరియు ఆర్థిక సహాయముతో నాలుగు సంపుటముల గ్రంథము ప్రచురితము చేసియున్నారు. ఈ గ్రంథమునకు భారత ఉపరాష్ట్రపతి ప్రశంశా పత్రం పొందియున్నారు. ఇవేకాక, వీరు ఆకాశవాణి విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు కేంద్రాలలో వివిధ సంగీత కార్యక్రమాలలోను, ప్రసంగాలలోను పాల్గొనియున్నారు.